# A Typical Teenager

శ్రీనాధ్ జొన్నపిత్తుల

"Dad", అన్నాడు Chris గట్టిగా, "I'm bored already". పదిహేడేళ్ళుంటాయి మా సుపుత్ర రత్నానికి. ఇప్పుడే హైస్కూలు కొచ్చాడు. మొన్ననే డ్రైవర్స్ లైసెంసు కూడా వచ్చింది. వేసవిసెలవలు మొదలుబెట్టినప్పుడినుంచీ రోజూ కారు తీసుకుని ఎక్కడికో షికార్లకెడుతూ ఉంటాడు. ఒక్కడే ఏం వెళ్ళడు - వాడికున్న ఇద్దరి స్నేహితులు - John అనే కుర్రవాడు, Julia అనే అమ్మాయితో కలిసి వెళతాడు (నాకు తెలిసినంత వరకూ). వీళ్ళు ముగ్గురూ కలిసి ఊరుమీద పడి రోజంతా ఎక్కడుంటారో, ఏంచేస్తారో తెలీదు.

మా పుత్రరత్నానికి తెలుగు ఒక్క ముక్కైనా రాదు. 'కృష్ణ అని ముద్దుగా పేరుపెడితే దాన్ని ముచ్చటగా 'Chris' చేసుకున్నాడు. వాడి తిండి కూడా అంతా అమెరికన్ తిండే. చిన్నప్పటినుంచీ అలవాటైపోయింది మరి... ఇప్పుడనుకుని ఏం లాభం? చిన్నప్పుడు సంగీతం మీదా, తెలుగు సినీమాల మీదా కొంచమైనా ధ్యాస ఉండేది, ఇప్పుడదికూడా లేదు. పగటి పూట వాడి గదిలోకి వెళితే, రాక్ మ్యూసిక్ గట్టిగా వినబడుతూ వుంటుంది. రాత్రైతే కొంచం కనికరించి హెడ్ ఫోను పెట్టుకుంటాడే గాని ఆ పిచ్చి మ్యూసిక్ మానడు.

మొత్తానికి చెప్పాలంటే ఒక typical teenager.

ఇక లాభంలేదు, ఈసారైనా సెలవల్లో, మా ఊరొకసారి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. వీడు మరీ చెయిజారిపోకముందే ఒక సారి మన ఊరు చూపించాలి, అక్కడివాతావరణం ఒకసారి వాడు అనుభవించాలి అనుకున్నాను. మా ఆవిడకు లీవుదొరకలేదు... అయినా సరే, వెళ్ళాలని పట్టుబట్టాను.



అరిచి గోలచేసాడు. project work అన్నాడు, baseball practise అన్నాడు. దేనికీ నేను ఒప్పుకోలేదు. ఇక తప్పక నాతోబాటు ప్లేనెక్కాడు. కానీ, ఎక్కినప్పుడినుంచీ ఒకటే గొడవ ..

Tell me again, Dad, why do we need to go to India now?

ఏమి చప్పాలో తోచక, తాతయ్య, మామ్మ నిన్ను చూడాలని చాలా అనుకుంటున్నారని చెప్పాను. గంటలదరపడి ప్రయాణం .. నిద్రాలాహారలు సరిగ్గా లేకుండా, రెండుసార్లు ప్లేనులు మారి చివరికి జెట్ లాగ్ తో హైదరాబాదు చేరాము. ఆ రాత్రికక్కడ హోటల్లో పడుకొని మర్నాడు మావూరుకు బయలుదేరాము. రాత్రంతా ఇద్దరికీ సరిగ్గా

నిద్రపట్టలేదు. రైలు బయల్దేరగానే ఇద్దరికీ కునుకు మొదలైంది... చాలా సేపే పడుకున్నాం.

కళ్ళుతెరిచేసరికి సాయంత్రం కావస్తున్నది. కిటికీలోంచి బయటకు చూసాను. పచ్చని పొలాలు, ఎటుచూసినా చిరుగాలికి ఊగుతూ వరిపైరు - చాలా ప్రశాంతంగా ఉంది. ఏదో స్టేషన్ వస్తున్నట్టుంది, ట్రైను నెమ్మదిగా వెడుతోంది. అందుకేనేమో నాకు మెలుకువ వచ్చింది. కృష్ణ కూడా నెమ్మదిగా కళ్ళు తెరుస్తున్నాడు. 'Dad, can we get some coffee' అన్నాడు. ఇక్కడ ట్రైంలో అటువంటివి దొరకవు.... ఇదిగో స్టేషనేదో వస్తున్నట్టుగా వుంది, అక్కడ తెప్పిద్దాం అని సరిచెప్పాను.

స్టేషన్ లో కాఫీ వాడికి నచ్చలేదు. అసలు వాళ్ళ కప్పులు చూడడానికే అసహ్యంగా ఉన్నాయి. నాకేదో అలవాటుకాబట్టి నేను తాగేసాను. వాడు మాత్రం కోక్ తెచ్చుకుని తాగడం మొదలుబెట్టాడు. how much longer, dad? అని అడిగాడు. పాపం ఇప్పటికే రెండురోజులనుంచి ప్రయాణం.... ఇంకో గంటన్నరుంటుందని చెప్పాను.

చివరికి మా ఊరు వచ్చింది. మా అక్కయ్య లతా, బావగారు మోహనూ మాకోసం స్టేషనికొచ్చారు. ట్రైను మళ్ళీ బయల్దేరేలోగా గబగబా మా పెట్టెలు దింపించాడు వాళ్ళ డ్రైవరు. చాలాసంవత్సరాల తరువాత వీళ్ళని చూస్తున్నాంగాబట్టి అందరూ చాల excited గా ఉన్నారు. లత కృష్ణదగ్గిరికి వచ్చి పలకరించింది "ఏరా ఎలా ఉన్నావు?! క్రిందటిసారి చూసినప్పుడు ఇంత చిన్నగా ముద్దొస్తూ ఉండేవాడివి - ఎంత ఎదిగిపోయావ్ ! మీ అమెరికాలో నీకు బాగా సరిపోయినట్టుందే! ". పాపం వాడికి ఒక్కమాటకూడా అర్థంకాలేదని వాడిమొహం చూసిన లతకి అర్ధమయింది. how are you doing, Krishna, you look so big now! అన్నది. I'm fine, aunty! But can you please not call me that, aunty, please call me Kris అన్నాడు. "ఇంత మంచిపేరు పెట్టుకుని ఇదేంఖర్మరా నీకు!" అంది. కానీ, అప్పట్నుంచీ లత వాడిని అలాగే పిలవడం మొదలుబెట్టింది. అందరం వాళ్ళ కారులో ఎక్కి ఇంటికి బయలుదేరాం.

మరీ అంత చిన్నదేమీ కాదు మా ఊరు. ఊరౌతలంతా పొలాలు ఉన్నా ఊరిలో కొంచం మోడర్న్ గా షాపులు, సినిమా థియేటర్లు అవీ ఉన్నాయి. ఒక మంచి junior college, hospital కూడా ఉన్నాయి. మా ఇల్లు ఊరికి చివ్వరిగా ఉండటం వల్ల, ఊరంతా దాటి వెళ్ళాల్సివచ్చింది. నేను పుట్టిపెరిగిన ఊరైనా, ఈచాలా మార్పులు రావడంవల్ల - కొన్ని కొన్ని చోట్ల అసలు గుర్తేపట్టలేకపోయాను. నేనువెళ్ళిన స్కూలు, కాలేజి ఇవన్నీ కృష్ణకి చూపిస్తూవచ్చాను. వాడికి కొంచం పిసుగెత్తినా పాపం ఓపిగ్గా నా నోదంతా విన్నాడు. 'చాలా మంచి కుర్రాడే, పాపమ్..అనిపించింది

"Dad, can I call Julia now?" అన్నాడు, సెల్ ఫోను తీస్తూ. ఏర్పోర్ట్ చేరిన వెంటనే అద్దెకితీసుకున్నాడు ఈ ఫోను. లత ఆశ్చర్యంతో చూచింది, కానీ నా మొహంలో చిరాకుచూసి ఏమీ అనలేదు. ఇప్పుడు కారులోంచెందుకు, ఇంటికెళ్ళాక తీరికగా చేసుకుందువుగానని నచ్చచెప్తే, సరేనన్నాడు.

ఒక అరగంటప్రయాణం తరువాత చివరికి మా ఇంటికి చేరాం. మా అమ్మా, నాన్నగారు బయట వెరండాలో కూర్చుని మాకోసం ఎదురు చూస్తున్నారుగాబోలు - కారు గేటుదగ్గరికి రాగానే ఇద్దరూ బయటకి వచ్చి స్వాగతం పలికారు. అమ్మ నన్ను పలకరించి కృష్ణని గట్టిగా కౌగలించుకుంది.

కృష్ణ చిన్నప్పుడు, వీళ్ళొకసారి అమెరికా వచ్చి మాతో ఒక ఆరు నెలలు గడిపారు. అప్పుడు వీడు రోజంతా మామ్మా మామ్మా అంటూ మా అమ్మ వెంటే తిరిగేవాడు. దానితో ఆమెకుకూడా వాడితో చాలా చనువు. రోజంతా వాడిబాగోగులన్నీ చూసేది. రోజూ వాడికి మామ్మ దోస తింటేగానీ తెల్లవారేది కాదు. తరువాత వాడితోకూచుని వాడికి చిన్న

చిన్న పాటలు, పద్యాలు అవీ నేర్పేది. స్నానం చేయించడం, భోజనం పెట్టడం, నిద్రపుచ్చడం...అన్నీ చాలావరకూ తనే చేసేది. పాపం, ఆ తరవాత అరోగ్యం అంత బాగుండకపోవడంచేత మళ్ళీ వాళ్ళు అమెరికా రాలేకపోయారు. మేముకూడా మా ఉద్యోగాల గొడవల్లో పడి వీలుకుదరక ఇండియా వెళ్ళడం తగ్గించేసాం. పదేళ్ళతరవాత ఇదే మళ్ళీ వీడిని మా అమ్మ చూడడం.

"రారా కృష్ణా, నీకోసం దోసపిండి తయారుగా అట్టేపెట్టానూ, మామ్మ దోస వేసిస్తానా" అని లాక్కుపోయింది వాడిని. ఆవిడభాష వాడికి అర్థమయినట్టు లేదు గాని ఆవిడ మమకారం మాత్రం అర్థమయ్యి ఉంటుంది - తీయబోతున్న సెల్ ఫోను లోపలబెట్టేసి వెనకాలే వెళ్ళాడు. ఏదో అతికష్టమ్మీద ఆవిడవేసిన దోస పూర్తిచేసి, రెండోవదోస వద్దని లేవబోయాడు.

"అమెరికా బావకి దోసనచ్చినట్లు లేదే బామ్మ!" అని వినిపించింది తలుపు దగ్గరనుంచి. అందరం తిరిగి చూసాం. తరవాత తలుచుకుంటే నాకే నవ్వువచ్చింది; అచ్చం తెలుగు సినిమాల్లో హీరోయిన్ entrance లాగా ఉంది ఆ సంఘటన! ఆకుపచ్చని పరికిణీ, ఎర్రటి ఓణీ వేసుకుని తెలుగుదనం ఒలకపోస్తూ, ఒక పదహారేళ్ళ ఊర్వశి అక్కడ నిల్చుని ఒక చిరునవ్వుతో కృష్ణని చూస్తోంది. ఎవరీ ఊర్వశి? మా అమ్మను బామ్మ అని పిలిచిందేమిటీ! కొంపతీసి ఇది ....."ఓ, వచ్చావా తల్లీ! దా, నీకుకూడా వేసియిస్తాను మామ్మ దోస!" అని ముద్దుగా పిలిచి కూచోబెట్టి, నా వంకతిరిగి, "మన లక్ష్మి రా, గుర్తుపట్టలేదా?" అంది మా అమ్మ.

లక్ష్మి! అంటే మా అక్కయ్య లత కూతురు! ఎప్పుడో చిన్నప్పుడు ఒకసారి వాళ్ళు హైదరాబాదు తీసుకొస్తే చూసాం. కృష్ణైతే అసలు చూడలేదు. అప్పడికి ఆ అమ్మాయికి ఓ పదేళ్ళుండి ఉంటాయేమో.... పొట్టిగా, కొంచంలావుగా, కళ్ళకి సోడాబుడ్డీ అద్దాలేసుకొని ఉండేది. ఇప్పుడుచూస్తే మాత్రం, ఈ రంభెవరా అనిపించేలా తయారయింది!

నా సంగతి సరే ... ఆ మాట విని గబుక్కున పైకి చూసిన కృష్ణ మంత్రముగ్ధుడిలా చూస్తూనే ఉండిపోయాడు. లేవబోతున్నవాడుకాస్తా మళ్ళీ కూచున్నాడు. "maamma, can I have another one too?" అని అడిగాడు. అమ్మ ఆశ్చర్యపోయి వాడివంక ఒకసారి చూసి "తప్పకుండరా నాన్నా, కూచ్చో, లక్ష్మికి ఇది వేసాక నీకొకటేస్తాను" అని చెప్తే , కృష్ణ తలూపాడు. లక్ష్మి ముసిముసిగా నవ్వుకుంటోంది. మామ్మవైపు తిరిగి అదికూడా అడిగింది, అమెరికన్ ఆక్సెంటు తెప్పించుకొని, "maamma, can I have one". "ఛీ ఊర్కోవే వెంకిపిల్లా... అలా ఎగతాళిచెయ్యకూడదు బావని!" అని చివాట్లు పెట్టింది అమ్మ. చిత్రమేమిటంటే, మా వాడికేదో కోపమొస్తుందని నేను తిరిగి చూస్తే, వాడేమో సిగ్గుపడుతున్నాడు! కొంపతీసి వీడికి లవ్వు కాదుగదా! ఇప్పడికే వీడికి నాలుగో, ఐదో girl friends అయ్యారు, పాపం ఈ పిచ్చి పల్లెటూరిపిల్లకి ఏమైనా ఆశపెట్టి వదిలేస్తే అది తట్టుకోలేదు.... అమెరికా పద్ధతులు ఇక్కడ పనికిరావని వాడికి గట్టిగా చెప్పాలని నిర్ణయించుకున్నాను.

లక్ష్మి మామ్మని కోపంగా చూసి నోరు మూసుకుంది. కానీ పాపం ఎక్కువసేపు మాట్లాడకుండా ఉండలేదుకాబోలు..... "ఈ రాత్రికి దోసేనా బామ్మ, లేక భోజనమేమైనా పెడతావా!?" అన్నది. "కృష్ణకి మామ్మ దోసంటే చాలా ఇష్టమే, అందుకే వాడికోసం దోస వేసాను. అందరూ చేతులూ కాళ్ళూ కడుక్కొని వస్తే హాయిగా భోజనంకూడా చేద్దాం!" అని చెప్పింది మా అమ్మ. వెంటనే అందరం తయారై వచ్చి కూర్చున్నాం.

ఎన్నాళ్ళకి అమ్మ వంట మళ్ళీ రుచిచూడగలిగాం! దేశదేశాలలో gourmet 5 star restaurants లో భోజనం చేసినా, అమ్మ వంటని ఆరగించిన తృప్తి రాదే! ఆలుగడ్డ వేపుడూ, తీయగా పుల్లగా పులుసూ, ఖారం ఉట్టిపడేలా ఆవకాయ, చల్లార్చడానికి కమ్మని పెరుగు .. పల్లెటూరిభోజనమైనా విందుభోజనంలా అనిపించింది నాకు మాత్రం. ఇక్కడివాళ్ళైతే .. అదృష్టవంతులు! .. రోజూతినేవేకాబట్టి మరే మీ

ఆలోచించకుండా తినేస్తున్నారు. కాని నేను మాత్రం ఒక్కొక్క మెతుకు జాగ్రత్తగా నమిలి దానిలో రుచి ఏమాత్రం వృధాకాకుండా అనుభవిస్తూ తిన్నాను.

భోజనాలు అయిపోయాక లక్ష్మి, లత, మోహన్ సెలవ తీసుకుని వాళ్ళ ఇంటికి బయలుదేరడానికి సిద్ధం అయ్యారు. ఇక పట్టలేక అడిగాడు మావాడు "Will we see you again tomorrow?" అని, లక్ష్మి వంక చూస్తూ. "అవునే, రేపు ఆదివారం, సెలవేగా, బావని సినిమాకి తీసుకెళ్ళూ!" అంది అమ్మ. వేరే ఏమైనా చేద్దామనుకుందేమో సెలవ రోజున, కొంచం చిరాకొచ్చింది లక్ష్మి ముఖంలో. కానీ ఒప్పుకుంది, మర్నాడు 11 గంటలకు వస్తానని చెప్పింది.... వాళందరూ బయలుదేరారు.

***

"Dad, can you teach me Telugu" అన్నాడు మర్నాడు సాయంత్రం మావాడు. ఔరా! ఇన్నేళ్ళనుంచీ మేమెన్నివిధాలగా పోరుతున్నా ససేమిరా నేర్చుకోనన్నావు! ఇప్పుడేమ్మొంచుకొచ్చింది! అని అనుకుంటూ, ఎందుకురా, మామ్మకి నీ ఇంగ్లీషర్థమౌతోందిగదా, అని అడిగాను. "Not her, dad, she's cool! But ..". కొంచం గుచ్చి గుచ్చి అడిగితే పూర్తి కథ బయటబడింది. లక్ష్మికి కాలేజిలో రవి అనే ఒక స్నేహితుడున్నాడట. అతనుకూడా వీళ్ళతో lunch కి వచ్చాడట. ఆ తరువాత వీళ్ళుముగ్గురూ కలసి సినిమాకెళ్ళారట. లక్ష్మి మధ్యలో కూర్చుంటే, ఇద్దరు మొగాళ్ళూ ఇరుపైపులా కూర్చున్నారట. రవితో లక్ష్మి తెలుగులో ఏమ్మాట్లాడుతోందో తెలుసుకోవాలని వీడికి చాలా ఉబలాటంగా ఉందట!

తెలుగు మాట్లాడటం, అర్థమవ్వడం అంత తేలికగా రావురా, అని చెప్పి, సరే, నేర్చుకుందువుగాని అని నచ్చజెప్పాను. ఇదే సమయం అని కొంచం మొదలుబెట్టాను. ఒరేయ్, మరి మీ juliaకి కాల్ చేసావా అని అడిగాను. "No Dad, I don't feel like it" అన్నాడు. దాన్ని తెలుగులో చెప్పించాను వాడిచేత - వాడి మొదటి తెలుగు పాఠం అన్నమాట! -"లేదు నాన్న, నాకు చెయ్యాలనిపిచ్చట్లేదు". అప్పుడు నా లెక్చరు మొదలుబెట్టాను. లక్ష్మి ఒక పల్లెటూరి పిల్ల, నువ్వు ఇంకో వారం రోజుల్లో అమెరికా వెళ్ళిపోయేవాడివి, నువ్వు దానితో ఏమీ పిచ్చివేషాలు వెయ్యకు, అది దాని స్నేహితులతో ఏమ్మాట్లాడుకుంటే నీకెందుకు, వాళ్ళ గొడవ వాళ్ళను చూసుకోనీ అని చెప్పాను. ఏదో కొంచం దు:ఖం వచ్చింది వాడి ముఖంలోకి, కానీ ఏమీ జవాబు చెప్పకుండా నా భాషణంతా విన్నాడు.

మా Chrisది మొండిపట్టే. మర్నాడు లేచినప్పడినుంచి TV దగ్గర కూర్చుని తెలుగు ప్రోగ్రాములు పెట్టుకొని చూడడం మొదలుబెట్టాడు. మా అమ్మని పట్టుకున్నాడు మాటలకి అర్థాలు చెప్పమని. వాడి తెలుగంతా మామీద ప్రయోగం చేయడం మొదలుబెట్టాడు. మేమంతా ఏదో నవ్వాపుకుని వాడితో మాట్లాడటానికి ప్రయత్నం చేసినా మా ఇంట్లో పనివాళ్ళకీ, పక్కింటి పిల్లల్లకీ ఇదంతా చాల వింతగా ఉండేది. పాపం వాడ్నిచూసి నవ్వడం, వాడిని వెక్కిరించడం కూడా మొదలుబెట్టారు. అయినా ఏమీపట్టించుకోకుండా వాడి కృషి కొనసాగిస్తూ ఉన్నాడు.

ఓ రెండురోజుల తరవాత ఓ సాయంత్రం లక్ష్మి మళ్ళీ మా ఇంటికొచ్చింది. వీడు అప్పుడు దీక్షగా ఓ తెలుగు సీరియల్ చూస్తున్నాడు. hello, Chris అని పలకరించింది. చాలా seriousగా పైకి తలెత్తి "లక్ష్మి, నన్ను ఇకనుంచీ కృష్ణ అని పిలుస్తావా" అన్నాడు. లక్ష్మి ఆశ్చర్యంతో వాడివంక చూసింది. Did you really learn Telugu or did you just memorise that!? అంది. ఇదంతా వింతగా అనిపించింది నాకు - వీడు తెలుగు మాట్లాడుతుంటే లక్ష్మి వీడితో ఇంగ్లీషులో మాట్లాడటం! "కాదే లక్ష్మి, నిజంగానే నేర్చుకుంటున్నాడు, పాపం రోజంతా కష్టపడుతున్నాడు!" అన్నది అమ్మ. "అబ్బో, అమెరికాబావకి మన తెలుగు మీద ఇంత ఇష్టమెప్పుడుపుట్టుకొచ్చిందో!" అన్నది లక్ష్మి. ఇదివిన్న కృష్ణ ఆడపిల్లలా కొంచం సిగ్గుపడుతూ ఎదో జోక్ చేస్తున్నట్లు "నీకోసమే" అన్నాడు. వాడుజోకుగా చబుదామనుకున్నా లక్ష్మి ఏమీ నవ్వలేదు,

వాడిసెక్కిరించలేదు. ఒకసారి వాడివంక చూసి ఏదో మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయింది.

కాలేజిలో చాలా పనుందికాబోలు, ఆ తరువాత మళ్ళీ మూడు నాలుగు రోజులు లక్ష్మి కనపడలేదు.. మేమంతా చుట్టుపక్కల ప్రదేశాలు చూడడానికి వెళ్ళాము. పెద్దగా చూడదగినవేవీ లేకపోయినా, ఊరుదాటి బయటకి ఎటువెళ్ళినా పచ్చని పొలాలతో చాలా ప్రశాంతంగా ఉంటుంది. పక్కన కొండమీదున్న అమ్మవారు ఆలయానికీ, కొత్తగా కనుగొనబడిన గుహలకీ, అలా షికారు వెళ్ళాం. కృష్ణ పెద్దగా ఏమీ సంతోషంగా లేడు. ఏదో మాతోబాటు వస్తున్నాడేగాని వాడి మనసంతా ఇంకెక్కడో ఉందని తెలుస్తూనే ఉంది.

ఓ రెండురోజులుండి, ఇక ఉండబట్టలేక మామ్మనడిగాడు, లక్ష్మి మళ్ళీ ఎప్పుడొస్తుందని. పాపం చిన్నపిల్లాడు, మనతో వీడికేంతోస్తుంది, అంటూ ఇంటికెళ్ళగానే లతకి ఫోన్ చేసింది అమ్మ. సెకెండ్ సాటర్డే గదా, లక్ష్మిని తీసుకురావే, రెండ్రోజులు సరదాగా కృష్ణతో గడపచ్చు అని చెప్పింది. లత సరేనంది. సాటర్డే పొద్దున్నే వీడు స్నానంచేసి తయారై కూర్చున్నాడు. వాళ్ళొచ్చేసరికు ఏ పదకొండో అయ్యింది. లక్ష్మి మాత్రం ఏదో చిరాకుగా ఉందనిపించింది. భోజనంచేస్తుంటే బయటపడింది. ఈ రోజు వాళ్ళ కాలేజివాళ్ళు సరదాగా క్రికెట్ మాచ్ పెట్టుకున్నారట, అందులో రవి ఆడుతున్నాడుగాబట్టి లక్ష్మికి చూడాలనివుందట. దాందేముందీ, కృష్ణనికూడా తీసుకునెళ్ళవే, అన్నది అమ్మ. భోజనమవ్వగానే ఇద్దరూ బయల్దేరారు.

వాళ్ళిద్దరూ తిరిగి వచ్చేటప్పటికి రాత్రయ్యింది. మేమందరం భోజనాలయిపోయి కబూర్లు చెప్పుకుంటూ కూర్చునివున్నాం. పిల్లలొచ్చారు.... క్రికెట్ మాచ్ అయ్యాక ముగ్గురూ కలసి హోటల్కి భోజనానికి వెళ్ళారట. కాసేపు కూర్చుని ఇక ఇంటికి బయల్దేరింది లక్ష్మి. మళ్ళీ రేపొస్తావుగదా, అని అడిగాడు కృష్ణ. కొంచం చిరాకుగా "మళ్ళీ రేపెందుకు, ఇవాళ్ళంతా కలిసేవున్నాంగదా" అంది. మా అమ్మేమీ ఊరుకోలేదు. "అదేమిటే, ఇంకో నాలుగు రోజుల్లో మళ్ళీ అమెరికా వెళ్ళిపోతాడుగదే, కాస్సేపు కలసివుండండే" అని మందలించింది. ఇక తప్పదని లక్ష్మి ఒప్పుకుంది.

ఇదంతా చూస్తుంటే నాకు కాస్త జాలేసింది వాడిమీద. అమెరికాలో ఉన్నంతకాలం ఆడపిల్లలంతా వీడివెంట పడేవాళ్ళు. ఇక్కడికొచ్చి వీడి పరిస్థితి ఇలా అయిపోయింది! అందరూ ఇక పడుకోవడానికి వెళ్ళిపోయాక కాసేపు వాడితో మాట్లాడుతూ కూర్చున్నాను. క్రికెట్ మాచ్ లో రవీ జట్టు గెలిచిందట. రవీ ఒక్కడే 50 పరుగులు చేసి గెలిపించాడట. లక్ష్మికి క్రికెట్ అంటే చాలా ఇష్టంగాబట్టి రవిని తెగ పొగడేస్తుంటే, కృష్ణకి చాలా బాధగా అనిపించిందిట ..

మర్నాడు లక్ష్మి వచ్చేటప్పటికి పన్నెండున్నరయ్యింది. పెద్దేమీ మాట్లాడకుండా భోజనానికి కూర్చుని, భోజనం అవ్వగానే బయల్దేరతానన్నది. కానీ ఆ సాయంత్రం మమ్మల్ని చూడడానికి మా తమ్ముడు వాళ్ళు వస్తున్నామని ఫోన్ చేస్తే, అమ్మ వెంటనే లతకి కూడా ఫోన్ చేసి మోహన్ తో సహా రమ్మంది. అందుకని లక్ష్మి కూడా ఉండిపోవాల్సి వచ్చింది.

మూడయ్యేసరికి అందరూ ఇంటికొచ్చారు. చాలాయేళ్ళతరవాత చూడడంగాబట్టి చాలా కబుర్లు దొర్లాయి. మా తమ్ముడు శేఖర్కి చిన్నప్పడినుంచీ క్రికెట్ పిచ్చి చాలా ఎక్కువ. అందరిని బయటకి లాక్కెళ్ళి ఒక మాచ్ మొదలెట్టాడు. లక్ష్మి కూడా చాలా సరదాపడి ఆడతాననడం చూసి కృష్ణ కూడా ఒప్పుకున్నాడు. ఒకపక్కకి లాగి అడిగాను - నీకేమొచ్చురా, క్రికెట్ ఆడడం అని. ఫరవాలేదు నాన్న, కొంచం బేస్బాల్ లాగానే ఉంటుందీ, అన్నాడు చిరునవ్వుతో.

నేను, లక్ష్మి, కృష్ణా ఒక టీం అయితే సేఖరు, మోహను, లతా ఒక టీం. అమ్మా, నాన్న ఫీల్డింగ్ చేస్తాంగానీ మిగతావేమీ చేయలేమన్నారు. వాళ్ళ సత్తానో మరి

మేము వేసే బాల్స్ అంతబాగ ఉన్నాయో తెలియదు కానీ, మోహనూ, శేఖరూ ఇద్దరూ చాలా బాగా బాటింగ్ చేసారు. ఎలాగయితేనే, చివరికి కృష్ణ బాటింగి వచ్చేసరికి మేమిక ఓడిపోయామనే అనుకున్నాం. 20 పరుగులు కావాలి గెలవడానికి. చాలా ధైర్యంగా వచ్చాడు క్రీస్ దెగ్గరకి. క్రికెట్ బాట్ పట్టుకోవడం సరిగ్గా చేతగాలేదు - వాడికి అలవాటైనట్టు baseball bat లాగా పైకి ఎత్తి పట్టుకుంటే అందరూ నవ్వడం మొదలుబెట్టారు. మొహన్ అతి వేగంగా వచ్చి ఒక full toss వేసాడు. నేనూ, లక్ష్మి ఇక అంతా అయిపోయిందనుకున్నాం.

ఎలా కొట్టాడో తెలీదు కానీ, ఆ బాల్ తిన్నగా పైకి వెళ్ళి దూరంగా చెట్లదగ్గర పడింది. home run అని అరిచాడు ఉత్సాహంగా. లక్ష్మి గబ్బుక్కున వాడివంక చూసి సంతోషంతో చప్పట్లు కొట్టింది. దాంతో కృష్ణకి వీరోత్సాహం పుట్టుకొచ్చింది. ఓవర్లో మిగిలిన నాలుగు బాల్స్ లో మూడు సిక్సర్లు కొట్టి మాచ్ పూర్తిచేసేసాడు!

***

మేము మళ్ళీ అమెరికాకి తిరిగివచ్చే ప్రయాణం ఇంక మూడురోజుల్లోకి వచ్చింది. కృష్ణగాడి ముఖంలో కాస్త దిగులు కనిపిస్తోంది. ఈమధ్య వాడు రోజూ లక్ష్మితో చాలాసేపే కలిసితిరుగుతున్నాడు. వాడి Julia కి కాల్ చేసికూడా చాలారోజులే అయినట్లుంది. వాడి భాషలోకూడా మార్పొచ్చేసింది. చాలా మటుకు తెలుగులో మాట్లాడడం మొదలుబెట్టేసాడు.

"నాన్నా, మనం ఇంకొన్నిరోజులు ఉండచ్చా" అని అడిగాడు నెమ్మదిగా . అసలురానని గొడవచేసిన వాడు ఇంకా ఉంటాననడం విని నాకు చాలా సంతోషం కలిగించింది. కానీ ఏంచేద్దాం - ఇక్కడే ఉండిపోవడానికి నా బాస్ ఒప్పుకోడే. వాడితో చెప్పడానికి ప్రయత్నం చేసాను. "ఫరవాలేదు నాన్నా, నువ్వు వెళ్ళిపోవచ్చు. నేనొక్కడ్నీ ఉండగలను. మామ్మ ఉందిగా, మామ్మతో ఉంటాను. ప్లీస్ నాన్న, స్కూలు మొదలయ్యేదాక నేనుండవచ్చుగా!" అని దీనంగా అడిగాడు. ఏదో మ్యూసిక్ డైరెక్టరు పెట్టినట్టు అప్పుడే వెనకాల రేడియోలో "ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడు" అనే పాట మొదలయ్యింది. పక్కనే ఉన్న మా అమ్మ మా సంభాషణంతా వింటూనే వుంది. ఆ పాట వచ్చేసరికి చిరునవ్వుతో "అవున్రా, ఫరవాలేదు, ఉండనివ్వరా ఇంకొన్నాళ్ళు. సెలవలవ్వగానే మేంవాడ్ని ప్లేనెక్కిస్తాంలే. నువ్వేమీ భయపడనవసరం లేదు" అని వాడ్ని వెనకేసుకొచ్చింది.

వాడిని వదిలి నేనెప్పుడూ రెండురోజులకన్నా ఉండలేదు. అయినా పెద్దవాడవుతున్నాడు. వయసులోనే కాదు - బుద్ధిలో కూడా! మన ఊరొచ్చి మన తెలుగు పడుచుని చూసి ఆమెకోసం మన భాషనేర్చుకుని ఇక్కడింకొన్ని రోజులుంటానంటే నేనే మనగలను? "సరే రా, నీ ఇష్టం! అలాగే ఉండి రా" అని గట్టిగా కౌగిలించుకున్నాను.

***

"Dad, are we there yet!?" అని గట్టిగా వినిపించింది. ఉలిక్కిపడి లేచాను. ఏదో స్టేషన్ వస్తున్నట్టుంది, ట్రైన్ నెమ్మదిగా వెడుతోంది. అందుకేనేమో, మేలుకువచ్చింది మా ఇద్దరికీ. అంతా కలేనన్నమాట!! నిజంగా ఏమౌతుందో?!